
సాక్షి
పల్నాడు
గురువారం । 16 । నవంబర్ । 2023



శ్రీరామచంద్ర మిషన్‌చే ధ్యానోత్సవం

తెనాలి: శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడురోజుల ధ్యాన శిక్షణ తరగతులు చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో ఆరంభించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2823 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1055 క్యూసెక్కుల వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జయ జయ జలహే

పులకించిన పల్నాడు

- మాచర్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన దిగ్విజయం
- భారీగా తరలివచ్చిన ప్రజలు,అభిమానులు
- మాచర్లలో 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సీఎం పచ్చజెండా
- ఆదంత్యం ఉత్సాహంగా సాగిన వరికపూడిశెల ప్రాజెక్టు పనుల శంకుస్థాపన

రాతినేల నుంచి జలసిరులు ఉబికి వచ్చినట్టు.. పౌరుషాల గడ్డ జనతరంగమై పరవళ్లుతొక్కింది. చెన్నకేశవస్వామిని అభిషేకించే చంద్రవంక నెలవంకై నవ్వినట్టు.. మాచర్ల ఆనందపరవశమైంది. నాగులేరు నాపరాళ్లను బద్దలుకొట్టి బీడులను ముద్దాడేందుకు ఉరకలెత్తినట్టు.. 'మెట్ట'నింట కర్షకలోకం కదంతొక్కింది. పల్నాడుకు మంచిరోజులొచ్చినట్టు.. పల్లెసీమలు ప్రభంజనమై కదిలాయి. సజ్జ జొన్న కూళ్లు ఇక చెల్లు అంటూ గళమెత్తాయి. 'వరి'కపూడిశెల వరాల రేడుకు బ్రహ్మరథం పట్టాయి. జనజేతకు జేజేలు పలికాయి. జయజయ 'జల'హే అంటూ నినదించాయి. రాజకీయ చిల్లరదేవుళ్ల భరతం పడతామని ధ్వజమెత్తాయి. సర్పంబులు, తేళ్లతో కూడిన దుష్టచతుష్టయంపై పల్నాటి సింహాలై గర్జించాయి.



ప్రగతి 'జ్యోతి' : జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పిన్నెల్లి, రజిని



అచం'జల సంకల్పం' : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాజెక్టు స్వరూపాన్ని మ్యాప్‌పై వివరిస్తున్న ఇరిగేషన్ అధికారి చిత్రంలో (కుడి నుంచి) మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజిని, సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, కలెక్టర్ శివశంకర్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు



జన జయధ్వానం : సభాప్రాంగణంలో కిక్కిరిసిన అశేష జన సందోహం

సాక్షి, నరసరావుపేట: పల్నాటి ప్రజల తలరాతను మార్చే వరికపూడిశెల ప్రాజెక్టు పనుల శంకుస్థాపన కోసం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాచర్ల నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అపర భగీరథుడికి అడుగడుగునా నీరాజనాలు పలికారు. మాచర్ల పట్టణ శివారు చెన్నకేశవకాలనీ ఎదురు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో బుధవారం సీఎం పాల్గొన్నారు. సీఎం హోదాలో రెండోసారి పట్టణానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు మాచర్లలోనే ఉన్నారు. ఈ సందర్భంగా 'రాజన్న బిడ్డా.. నిన్ను మరువదు పల్నాడు గడ్డ' అంటూ ప్రజలు జయజయధ్వానాలు పలికారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన భారీ జనసందోహంతో గుంటూరు రోడ్డు కిటకిటలాడింది. తొలుత వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగే ప్రాంతాన్ని సీఎం హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద ప్రాజెక్టు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఉదయం 11.57 గంటలకు వరికపూడిశెల పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

100 పడకల ఆస్పత్రి మంజూరు

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విన్నపం మేరకు ముఖ్యమంత్రి తన ప్రసంగంలో మాచర్ల పట్టణంలోని 50 పడకల సీహెచ్‌సీని 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్నతీకరిస్తున్నట్టు ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పిన్నెల్లి కోరినట్టు నియోజకవర్గానికి 1,000 జలకళ బోర్ల మంజూరు, బుగ్గవాగు పనుల పూర్తి, ఆటోనగర్ అభివృద్ధి, నాగార్జున సాగర్ క్వార్టర్లలో నివాసితులకు పట్టాలు, రూ.8 కోట్ల విలువైన రోడ్లు, కారంపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.1.5 కోట్ల మంజూరు వంటి వినతులన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం వేదికపైకి రాగానే ప్రజల హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. 'వై నాట్ 175' అంటూ ప్లకార్డులతో ప్రజలు నినదించారు. సీఎం తన ప్రసంగంలో భాగంగా చెప్పిన సామెతలు, ప్రతిపక్షాలపై సంధించిన వాగ్బాణాలకు సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఆదిమూలపు సురేష్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్‌రెడ్డి, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, పోతుల సునీత, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందా శేషగిరిరావు, పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, పార్టీ అదనపు రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతనాయక్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, గుంటూరు రేంజ్ ఐజీ పాల రాజు, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.




జనా'కర్షక నేత'కు జేజేలు : సీఎం జగన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న పీఆర్కే, పీవీఆర్

సీఎం పర్యటన హైలైట్స్

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.45 గంటలకు మాచర్ల సాగర్ రోడ్డులో హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్నారు.
- పీఆర్కే, పీవీఆర్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎంకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.
- రోడ్డు మార్గాన 3.5 కిలోమీటర్ల దూరంలోని సభాస్థలికి బస్సులో సీఎం చేరుకున్నారు.
- దారిపొడవునా ప్రజలు, మహిళలు రోడ్డుకిరువైపులా బారులు తీరి జేజేలు పలికారు.
- సభా వేదికపై వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సీఎం పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.
- దాదాపు గంటసేపు సీఎం జగన్ ప్రసంగించారు.
- దాదాపు లక్ష మంది తరలి వచ్చినట్టు అంచనా.
- 60 వేల మందితో సభా ప్రాంగణం కిక్కిరిసింది.
- వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో మహిళలు ఏకరూప దుస్తులు ధరించి జననేతకు హారతులు పట్టారు. గుమ్మడి కాయలతో దిష్టి తీశారు.
- సుగాలి మహిళల పాటల కోలాహలం, యువకుల బైక్ ర్యాలీలతో మాచర్ల హోరెత్తింది.
- బందోబస్తును ఎస్పీ రవిశంకర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.

అపర భగీరథుడు జగన్

- పల్నాడు ప్రజల తరఫున ఆయనకు పాదాభివందనం
- వరికపూడిశెలకు వైఎస్సార్ పేరు పెట్టాలి
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే)



మాచర్ల: అపరభగీరథుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అభివర్ణించారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పల్నాడు సస్యశ్యామలానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ఈ ప్రాంత ప్రజల తరఫున శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ''చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు.. నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు.. సజ్జ జొన్నకూళ్ళు సర్పంబులుతేళ్లు.. పల్లెనాటి సీమ పల్లెటూళ్లు' అన్న శ్రీనాథుడు రచించిన పద్యాన్ని ప్రస్తావించారు. వరికపూడిశెల ఎత్తిపోతల నిర్మాణంతో కరువుసీమ సస్యశ్యామలం అవుతుందని స్పష్టం చేశారు. రూ.340 కోట్లతో మొదటి దశ పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. గతంలో చంద్రబాబు ఓట్ల కోసం ఇక్కడి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ఇక్కడి ప్రజల ఆకాంక్షల కోసం నిబద్ధతతో పనిచేస్తున్నారని పిన్నెల్లి స్పష్టం చేశారు. ఈ రోజు పల్నాడు చరిత్రలో పండగ రోజని అభివర్ణించారు. నియోజకవర్గంలో రూ.2,400 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు పిన్నెల్లి వెల్లడించారు. వరికపూడిశెల మొదటి దశ పనులు పూర్తయితే 24,900 ఎకరాలకు సాగునీరు అందుతుందని, రెండో దశ పూర్తయితే 1.43 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు. మొత్తం లక్ష మందికి తాగునీరు అందుతుందని వెల్లడించారు. ఆనాడు వైఎస్సార్ కలలుకన్న ఈ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని కోరారు.

సీఎంకు పిన్నెల్లి వినతి

మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని పిన్నెల్లి సీఎంను కోరారు. కారంపూడి మండలం పేట సన్నిగండ్లలో లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని, మాచర్ల పట్టణానికి బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా పనుల కోసం రూ. 81 లక్షలు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని, వెంటనే తగిన ఆదేశాలివ్వాలని, నాగార్జున సాగర్ నుంచి కొత్తూరుకు రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని, ఆటోనగర్ ఏర్పాటు కోసం రూ.5 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంకు ధన్యవాదాలు



వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు కింద వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు స్వాగతం. వెల్దుర్తి మండలం గంగులకుంట గ్రామ సమీపంలో నిర్మించే ఈ ప్రాజెక్టు వల్ల వెల్దుర్తి మండలంలో 24,900 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. రూ.340.26 కోట్లతో ఈ ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం జరగనుంది. ఈ స్కీం పనులు ప్రారంభించి ప్రజల జీవితాల్లో సంతోషాలు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు.

– లోతేటి శివశంకర్, కలెక్టర్, పల్నాడు

న్యూస్‌రీల్

ఓటర్ల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలి

గుంటూరు వెస్ట్ : జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల జాబితాలలో జీరో డోర్ నెంబర్ లేకుండా పూర్తి స్థాయి సవరణ చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్‌వోలు కచ్చితంగా వెళ్లాలన్నారు.

20న జావెలిన్‌త్రో ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : గుంటూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్- 16, 18, 20 యువతీ యువకుల క్రాస్ కంట్రీ, జావెలిన్‌త్రో తోపాటు 400 మీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన వారిని డిసెంబర్‌లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 96666 35296 సంప్రదించాలన్నారు.

పొన్నూరు చరిత్రను తిరగరాసిన జగనన్న

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

పొన్నూరు: దశాబ్దాలుగా అభివృద్ధి, సంక్షేమం ఊసేలేని పొన్నూరు నియోజకవర్గ రాజకీయ చరిత్రను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరగ రాశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇన్నాళ్లు అణగారిపోయిన బడుగు, బలహీన వర్గాల వారిని గుండెల్లో పెట్టుకుని సమున్నతంగా గౌరవించారని, సిఫార్సులతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందించారన్నారు. సీఎం జగన్ చేసిన ఈ మంచిని జనాలకు చెప్పేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్సార్ సీపీ నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలను అందించి వారి అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ల కాలంలో 2 లక్షల 37 వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అందించిందని తెలిపారు. గత ప్రభుత్వాలు రాష్ట్రంలోని దూరప్రాంతాల అభివృద్ధిని విస్మరించాయని, వారి సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధికి కూడా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసిందన్నారు. పేద వర్గాలకు చేసిన మేలును తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. పొన్నూరులో గత పాతికేళ్ల టీడీపీ హయాంలో చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే రోశయ్య చేసి చూపించారని అన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఏమీ చేయకుండానే తనకు చివరి అవకాశం ఇవ్వాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సీఎం జగన్ పాలనలో మేలు జరిగిందని భావిస్తే మరలా రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాదరావు చిత్రంలో జూపూడి తదితరులు

యార్డులో 29,637 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 28,515 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 29,637 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,264 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేపు విద్యుత్ అదాలత్

నరసరావుపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 17న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధికారి ఎస్. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వాసవీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న విద్యుత్ అదాలత్‌లో సాంకేతిక సభ్యులు ఎన్. విక్టర్ ఇమ్మానియేల్, కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని వినియోగదారుల సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. విద్యుత్ సరఫరాలో తరచుగా వచ్చే అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ మీటర్‌తో ఉన్న సమస్యలు, బిల్లులలో ఉన్న సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, రొంపిచర్ల, నకరికల్లు, ఈపూరు మండలాల వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జిల్లాలో సహకార వ్యవస్థ బలోపేతం

జిల్లా ఆడిట్ ఆఫీసర్ డి.శ్రీనివాసరావు



నరసరావుపేట: స్థానిక జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో బుధవారం 70వ సహకార వారోత్సవాల రెండవ రోజు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి డి. శ్రీనివాసరావు పతాక ఆవిష్కరణ చేశారు. చీఫ్ మేనేజర్ ఎస్.రమాదేవి అధ్యక్షత వహించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం సహకార వ్యవస్థకు వెన్నుదన్ను నిలుస్తున్నాయన్నారు. కోల్డ్ స్టోరేజీలు, పెట్రోల్ బంక్‌లు, జనఔషధి షాప్స్, మల్టీపర్పస్ గోడౌన్లు, కామన్ సర్వీస్ సెంటర్స్, వాటర్ ప్లాంట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గ్యాస్ గోడౌన్ల నిర్మాణంతో ఆర్థిక పరపతి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వక్తలు వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి సహకార సూత్రాలను వివరించి సహకార ప్రతిజ్ఞ చేయించారు. ఏజీఎం బత్తుల బాలకృష్ణారెడ్డి, అమరావతి బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, సీఈఓలు జీవీ సాంబశివారెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, రామాంజనేయులు, రాంబాబు, కార్తీక్, రవికుమార్, రమేష్ పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’.. ప్రతిష్టాత్మకం

- జిల్లా అధికారులందరు ప్రతి అర్జీని పరిశీలించాలి
- సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి ప్రజాసమస్యలపై అర్జీ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ రూరల్ ప్రాంతాలకు సంబంధించి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, తాడేపల్లి తహసీల్దార్ ఎం.నాగిరెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల ముందే సంబంధిత శాఖ అధికారులతో చర్చించి ఆ సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడే పరిష్కరిస్తున్నామని అన్నారు.

ప్రజాసమస్యలపై అర్జీ ..

వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, రూరల్ పార్టీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ రూరల్‌పరిధిలో ఉన్న పలు సమస్యలపై అర్జీలను అందజేశారు.

తాడేపల్లి పట్టణ పరిధిలో సీతానగరం కృష్ణానది ఒడ్డున ఉన్న కార్పొరేషన్ రేకుల షెడ్డులో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని తాడేపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి అర్జీని అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల ప్రత్యేక అధికారి మహబూబ్ బాషా, పీడీ డీఆర్‌డీఏ హరిహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, పశు సంవర్థక శాఖ జేడీ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, సీపీఓ శేషశ్రీ, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఉద్యాన శాఖ ఏడీ రవీంద్రబాబు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో విజయాలకు అడ్డదారులుండవు

గుంటూరు వెస్ట్: ఉద్యోగంలో విజయాలు సాధించాలంటే కష్టపడి, నిజాయితీతో పనిచేయడం ఒక్కటే మార్గమని, అడ్డదారులుండవని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇటీవల రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు సాధించిన జూనియర్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అతి దగ్గరగా ఉండి సేవలందించేది రెవెన్యూ శాఖన్నారు. ఇక్కడ పని నేర్చుకోవడానికి, సేవ చేయడానికి ఎంతో అవకాశముంటుందన్నారు. బర్త్ నుంచి డెత్ సర్టిఫికెట్ వరకు, పొలాలు, ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇలా ప్రతీ పనికి ప్రజలు రెవెన్యూ శాఖకు వస్తారని తెలిపారు. ఎప్పుడో బ్రిటీషర్ల కాలంలో జరిగిన భూ సర్వే స్థానంలో ఇప్పుడు రీ సర్వే చేపడుతున్నామని చెప్పారు. దీనిని కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చేవారు గుర్తుంచుకుని అన్ని విషయాలు నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలతో మర్యాదగా మాట్లాడుతూ అవినీతికి పాల్పడకుండా పనిచేయాలని కలెక్టర్ వివరించారు. డీఆర్ఓ చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఈ నెల 17 వరకు 111 మందికి శిక్షణ కొనసాగుతుందన్నారు. నేర్చుకునే క్రమంలో ఉండే సందేహాలను ఎప్పటికప్పుడు సీనియర్స్‌ని అడిగి తెలుసుకోవాలని చెప్పారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, రిటైర్డ్ ఆర్డీఓ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఈఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లాలో 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ)గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బీజడ్–3, బీఎస్సీ నర్సింగ్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీఫార్మసీ, డీఎంఎల్టీ ఐదు సంవత్సరాలు అనుభవం ఉన్నవారు ఉద్యోగానికి అర్హులని పేర్కొన్నారు. ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, కొల్లిపర ప్రాంతాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతలను నవంబరు 17లోపు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం రెండో ఫ్లోర్‌లోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరులో సంప్రదించాలని కోరారు.

పలు రైళ్లు పునరుద్ధరణ

లక్ష్మీపురం : సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్లను పునరుద్ధరించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. రైలు నంబరు 07783 విజయవాడ – గుంటూరు, 07788 గుంటూరు – విజయవాడ, 07779 గుంటూరు –మాచర్ల, 07780 మాచర్ల – గుంటూరు, 07780 మాచర్ల – నడికుడి, 07789 నడికుడి –మాచర్ల రైళ్లు ఈ నెల 16 నుంచి పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు.

హైందవ మత గురువుల జయంతి వేడుకలు

- దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ
- సీతా సభ్యుల సూచనల మేరకు నిర్ణయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ (సీత) భవనంలో ఇటీవల జరిగిన సమావేశంలో సభ్యుల సూచనల మేరకు హైందవ మత గురువుల జయంతి కార్యక్రమాల్ని నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్లు, సభ్యులకు రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్నవారు దేవాలయాల్లో ఆదాయ, వ్యయాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులతో పాటు శ్రీ ఆదిశంకర, శ్రీ రామానుజ, శ్రీ విఖనస, శ్రీ మధ్వాచార్యులు తదితర ప్రముఖ హైందవ మత గురువుల జయంతి వేడుకల్ని నిర్వహించాలని కోరినట్లు కమిషనర్ వివరించారు. పాలకమండలి వాటిని చర్చించి వారి జయంతి వేడుకల్ని అమలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దేవాలయాలకు భూరి విరాళాలు ఇచ్చే దాతల కోసం ప్రత్యేకంగా డోనర్స్ సెల్‌ను ఏర్పాటు చేసి, దానికి విధి విధానాల్ని కూడా అమలు చేయాలనే ప్రతిపాదనను కూడా ఆమోదించామని, వీటిని అమలు చేయనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

దీపావళి ప్రపంచవ్యాప్త పండుగ



వాలీబాల్ క్రీడాకారులతో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామి, కేఎల్‌యూ ఆచార్యులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి

తాడేపల్లి రూరల్: దీపావళి ప్రపంచ వ్యాప్త పండుగని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం జై శ్రీమన్నారాయణ, వీఆర్ యూత్ క్లబ్, కేఎల్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పురుషుల విభాగం పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అభిభాషిస్తూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి కానీ.. చదవడానికి కష్టపడకూడదని బోధించారు. ప్రతి ఒక్కరికీ విద్యతో పాటు క్రీడలు,ఆధ్యాత్మిక జ్ఞానం అవసరమని వివరించారు. మనిషిలో అజ్ఞానాన్ని పారదోలి మనిషిని మహా మనీషిగా చేసేదే విజ్ఞానమని పేర్కొన్నారు. కేఎల్‌యూ కార్యదర్శి కోనేరు శివ కాంచనలత మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆటల్లో కూడా ముందుండం సంతోషకరమని తెలిపారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. అనంతరం విజేతలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో విజ్ఞాన్ యూనివర్సిటీ, రెండో స్థానంలో బాపట్ల ఇంజినీరింగ్ విద్యార్థులు, మూడో స్థానంలో కేఎల్‌యూ విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిశోర్, వ్యాయామ అధ్యాపకులు, యువ వికాస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కో–ఆర్డినేటర్ అడుసుమిల్లి రాము, సెక్రటరీ మూర్తి, జిజ్ఞాస ఫౌండర్ అండ్ డైరెక్టర్ వై.భార్గవ్ పాల్గొన్నారు.

సాగులో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: పంటల సాగులో వాతావరణ మార్పులు, అధిక పురుగు మందుల వాడకం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాటి నివారణకు శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణల దిశగా కృషిచేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ) స్వర్ణోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఐసీపీహెచ్ఎమ్)లో వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయోటెక్నాలజీ ఉపయోగించి పురుగులు, తెగుల్లను తట్టుకునే జన్యువులను గుర్తించటం, శాటిలైట్ చిత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, కృత్రిమ మేథస్సుతో క్రిమిసంహారకాలను అవకాశంమేరకు ఉపయోగించటం వంటి వాటిపై పరిశోధనలు చేయాలని తెలిపారు. పీజేటీఎస్ఏయూ వీసీ ఎం.రఘునందనరావు, న్యూఢిల్లీకి చెందిన ఐకార్ ఏడీజీ డాక్టర్ ఎస్‌సీ దూబె, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మెట్టప్రాంతాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం

- బాపట్ల జిల్లా ఉద్యానశాఖాధికారిణి జెన్నమ్మ
- వెల్లటూరులో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు
- జిల్లాలో మూడు మండలాలు గుర్తింపు



అవగాహన సదస్సులో పాల్గొన్న బాపట్ల జిల్లా ఉద్యాన శాఖాధికారిణి జెన్నమ్మ

వెల్లటూరు(భట్టిప్రోలు): బాపట్ల జిల్లాలో ఆయిల్ పామ్ వృద్ధి చేసేందుకు అనుకూలమైన ప్రాంతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానవన శాఖలచే గుర్తించబడినట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారిణి పి.జెన్నమ్మ పేర్కొన్నారు. అజంతా సోయా లిమిటెడ్, ఏపీ ఉద్యానశాఖ (బాపట్ల జిల్లా) సహకారంతో జిల్లాలో వేమూరు నియోజకవర్గంలో మొదటగా గుర్తించబడిన భట్టిప్రోలు, కొల్లూరు, చుండూరు ప్రాంతాలలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించాలని తీర్మానించారు. ఇందులో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు సిద్ధి గణపతి స్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెన్నమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ స్థాపించడానికి, నర్సరీ మొక్కలు నాటడానికి ఈ కంపెనీకి అనుమతి లభించిందని, ఇందుకు జిల్లాలో ఉద్యానశాఖ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. మార్కెట్‌లో రూ. 250 ఆయిల్ పామ్ మొక్కను రూ.193లకే నూరుశాతం సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరారు. ఇందులో అంతర్ పంటగా మిర్చి తదితర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ పంట సాగుకు బోర్‌వెల్స్ తప్పనిసరిగా ఉండాలని, మెట్ట ప్రాంతం అనుకూలంగా ఉంటుందని, నీటి వసతి అనుకూలంగా ఉన్న భూములకే ఈ సాగుకు అనుమతి లభిస్తుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ అభయ్‌గోయల్ మాట్లాడుతూ 25 సంవత్సరాల అనుభవంతో రైతులతో కలసి పనిచేశామని, పూర్తిస్థాయిలో రైతులకు వ్యవసాయ సలహా సేవలు, ఎరువులు అందిస్తామని ఎకరాకు 57 మొక్కలు నాటాలని మొదటి మూడేళ్లవరకు వరి తప్ప అన్ని రకాల పంటలు అంతర్ పంటగా వేసుకోవచ్చునని ఎరువులు, అంతర్ పంటలపై మొదటి నాలుగేళ్ల వరకు హెక్టారుకు రూ.42 వేలు, పంట కోత పరికరాలు, గెలల రవాణాపై సబ్సిడీ, బిందు సేద్యం పరికరాలపై సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. తుపాను, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. అంతేకాకుండా పర్యావరణానికి కూడా అనుకూలంగా ఉండి వర్షాలు కురవడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సదస్సులో హార్టికల్చర్ ఆఫీసర్ కల్యాణ్, సంస్థ కన్సల్‌టెంట్ కె.సుధాకర్‌రెడ్డి, మేనేజర్ ఎస్ఎస్ బాషా, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కె.బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం ఒప్పందం



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసరావు, సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు

బాపట్ల అర్బన్: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల, సీఎస్సీ అకాడమీ భారత ప్రభుత్వ సంస్థ (మినిస్ట్రీస్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థలో విద్యార్థినులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఒప్పందంపై సీఎస్సీ అకాడమీ ప్రతినిధులు సంతకాలు చేశారన్నారు. ఒప్పందం ద్వారా యూజీ(అండర్ గ్రాడ్యుయేట్) చేస్తున్న ఎస్టీ, ఎస్సీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఆర్జేసీ భ్రమరాంబ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేసీ భ్రమరాంబ, డీసీ చంద్రశేఖరరెడ్డి

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆ శాఖ భూముల పరిరక్షణపై ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారులతో ఆర్జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్జేసీ డి.భ్రమరాంబ మాట్లాడుతూ ఆలయాల భూముల పరిరక్షణకు ప్రతి అధికారి నిబంధనలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాల వారీగా ఎంత భూమి ఉన్నది అడిగి తెలుసుకున్నారు. భూముల వివరాలు వెబ్ అడంగళ్లలో తప్పక అప్‌లోడు చేయాలని ఆదేశించారు. ఇప్పటికీ అప్‌లోడు చేయకపోతే వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా సూచించారు. ఆలయ భూముల ఎన్‌ఫ్రోచ్‌మెంట్ విషయంలో కొత్త ఆర్డినెన్స్ ప్రకారం కోర్టుకు వెళ్లే పనిలేకుండా నోటీసులు ఇచ్చి భూములు తగిన సమయంలో స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఆక్రమణదారులకు ఎంత మంది అధికారులు నోటీసులు ఇచ్చింది ప్రశ్నించారు. ఇద్దరు అధికారులు మాత్రమే నోటీసులు ఇచ్చినట్లు సమాధానం ఇవ్వడంతో ఆర్జేసీ అసహనం వ్యక్తం చేశారు. నోటీసులు ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన కంట్రిబ్యూషన్, ఆడిట్ ఫీజు, సీజీఎఫ్, అర్చక వెల్ఫేర్ ఫండ్ వెంటనే కట్టివేయాలని సూచించారు. డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్లు బి.మహేశ్వరరెడ్డి, డి.వాసు, కె.బి.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

వెనిగండ్ల చేరుకున్న 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు



ఆయా జిల్లాల టీమ్ కెప్టెన్‌లతో జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

పెదకాకాని: విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మూడు రోజుల రాష్ట్రస్థాయి అండర్–17, అండర్–14 బాల బాలికల బేస్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. గుంటూరు జోన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందన్నారు. ఉత్తమ క్రీడాకారులకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలలో పాల్గొనేందుకు 13 జిల్లాల నుంచి అండర్–17, అండర్–14 విభాగాలలో బాల బాలికలు 500 మంది వెనిగండ్ల పాఠశాలకు చేరుకున్నారు. అలానే 50 మంది స్పోర్ట్స్ మేనేజర్లు, 50 వ్యాయామ ఉపాధ్యాయులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొండమడుగుల జ్యోతి, టోర్నమెంట్ పర్యవేక్షకులు హృదయ రాజు, జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ ప్రతాపరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శ్యామల వెంకటరెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అహింసతోనే మానవ మనుగడ సాధ్యం

ముంబై ఐఐటీ అధ్యాపకుడు ఆచార్య సెబాస్టియన్



ప్రసంగిస్తున్న ఆచార్య సెబాస్టియన్

ఏఎన్‌యూ: హింసకు తావు లేకుండా అహింస ద్వారా మానవ మనుగడ సాధించడం జీవితంలో ఎంతో ముఖ్యమని ముంబై ఐఐటీ అధ్యాపకుడు ఆచార్య సీడీ సెబాస్టియన్ తెలిపారు. ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని ఏఎన్‌యూ బౌద్ధ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉపన్యాసానికి ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ బౌద్ధ ఆచారాత్మక తత్వశాస్త్రం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. యుద్ధం, హింసను వీడితేనే మానవ జీవితం నిజమైన మార్గంలో పయనిస్తుందని తెలిపారు. అన్ని మతాలు ధర్మం, నైతిక విలువలు, ప్రపంచ శాంతి, మానవ మనుగడ అనే అంశాలు ఉద్బోధిస్తున్నాయని, వాటిలోని అంశాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. బౌద్ధ ధర్మంలో పంచశీల అనేది ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. బౌద్ధ ధర్మం ద్వారా మానవ మనుగడ ఉత్తమ మార్గంలో కొనసాగుతుందని చెప్పారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ అందరూ శాంతియుత వాతావరణంలో మనుగడ సాగించాలనే వాస్తవాన్ని గుర్తించాలని తెలిపారు. యూనివర్సిటీ బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో బుద్ధుని సిద్ధాంతాలపై అధ్యయనం, పరిశోధన క్షేత్రస్థాయిలో కొనసాగేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయకుమార్ ప్రసంగించారు. అధ్యాపకులు, బౌద్ధ భిక్షువులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది మార్చి 20 నుంచి 22వ తేదీ వరకు ‘బుద్ధిస్ట్ ఫిలాసఫీ అండ్ మైండ్ అండ్ కాగ్నిటివ్ సైన్స్ విత్ హ్యూమన్ మోరల్ ఎక్స్‌పీరియన్స్’ అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి. రాజశేఖర్, ఐఐటీ అధ్యాపకుడు ఆచార్య శబాస్టియన్, యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆవిష్కరించారు.